

## అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువా

### కొండగట్టు అంజన్నకు భక్తుడు కానుక

ప్రజాపక్షం/మల్యాల : జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి వారికి సిరిసిల్ల చేనేత కళాకారుడు వెల్ది హరి ప్రసాద్ అగ్గి పెట్టెలో ఇమిడి పోయే అద్భుతమైన పట్టు శాలువాను మంగళవారం బహూకరించాడు. దీనిని హరి ప్రసాద్ ఎంతో అందంగా, సన్నని పట్టుదారాలతో, శ్రద్ధతో శ్రమించి రూపొందించిన ఈ ప్రత్యేక పట్టు శాలువా అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అగ్గిపెట్టెలో సులభంగా ఇమిడిపోయే ఈ శాలువా ఆయన కళా నైపుణ్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.మంగళవారం ఉదయం కొండగట్టుకు చేరుకున్న ఆయనస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టు శాలువాను ఆంజనేయ స్వామికి సమర్పించారు. సిరిసిల్ల చేనేత కళాకారుల నైపుణ్యానికి అద్దం పట్టేలా తయారు చేసిన శాలువా ఆలయంలో ప్రత్యేకంగా నిలిచింది. హరి ప్రసాద్ శాలువాను స్వామికి సమర్పించిన పూజారులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అరుదైన కానుకను సమర్పించిన హరి ప్రసాద్ కుటుంబ సభ్యులను పండితులు ఆశీర్వదించారు. కొండగట్టు అంజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువా బహుకరణ అగ్గిపెట్టెలో ఇమిడేంత సూక్ష్మంగా నేసిన పట్టు శాలువాను కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామివారికి భక్తిపూర్వకంగా సమర్పించారు.చేకొండగట్టు ఆలయానికి చేరుకున్న హరిప్రసాద్, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ అరుదైన శాలువాను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ ఆంజనేయస్వామి ఆశీస్సులతోనే ఈ కళాఖండాన్ని రూపొందించి స్వామివారికి సమర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## ముత్యంపేటలో బంగారం, నగదు చోరీ

ప్రజాపక్షం/మల్యాల : జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామ పరిధిలోని బలవంతపూర్ అడ్డరోడ్డు వద్ద లక్ష్మి అనే మహిళ ఇంటిలో చోరీ జరిగినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ముత్యంపేట గ్రామానికి చెందిన బొమ్మ బోయిన లక్ష్మి బలవంతపూర్ గ్రామంలో అద్దె ఇంటిలో నివసిస్తూ, తన సొంత ఇంటికి తాళం వేసి అప్పుడప్పుడు వచ్చి పోయేది. ఇదే అదునుగా భావించిన దుండగులు ఆ ఇంటిలోకి చొరబడి బీరువాను పగలగొట్టి అందులో ఉన్న తులం బంగారం , కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బైండోవర్ నిబంధనలు ఉల్లంఘన

### రూ.20,000 వేల జరిమానా



ప్రజాపక్షం/ముత్తారం : బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి చట్టవిరుద్ధంగా నాటు సారాయి విక్రయించిన ఒక మహిళకు 20,000 వేల రూపాయల జరిమానా విధించినట్లు మంథని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ రాకేష్ కుమార్ తెలిపారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన దుగ్యాల శ్రీలత గతంలో నాటు సారాయి అమ్మిన కేసులో పట్టుబడ్డారు. దీంతో ఆమెను 11 సెప్టెంబర్ 2025న ముత్తారం మండల తహసిల్దార్ ఎదుట లక్ష రూపాయల పూచికత్తుతో, ఏడాది కాలపరిమితికి బైండోవర్ చేశారు. అయితే, ఈ బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆమె జూన్ 20, 2026న తిరిగి నాటు సారాయి అమ్ముతూ పట్టుబడ్డారు. దీనిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. బెయిల్ నిబంధనలు అతిక్రమించినందుకు గాను, ముత్తారం తహసిల్దార్ ఆదేశాల మేరకు మంగళవారం ఆమెకు 20,000 వేల రూపాయల జరిమానా విధించి, ఆ మొత్తాన్ని వసూలు చేశారు.

**సారా విక్రయిస్తే కఠిన చర్యలు.. సమాచారం కోసం నంబర్ విడుదల**

ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ముత్తారం మండలంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా నాటు సారాయి తయారు చేసినా, అమ్మినా, లేదా రవాణా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో నాటు సారాయికి సంబంధించి ఎలాంటి సమాచారమైనా ఇవ్వదలచిన వారు 8712658820 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ చర్యల్లో మంథని ఎక్సైజ్ ఎస్హెచ్ఓ రాకేష్ కుమార్, ఎస్సై సాయికుమార్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే ఎరువుల కొరత



సర్ సభలో మంత్రి పొన్నం ప్రకటన

ప్రజాపక్షం/హుస్నాబాద్ : కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్లనే రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడిందని బిజెపి ప్రభుత్వం కావలనే ఎరువుల కొరత సృష్టిస్తుందని తెలంగాణ బిసి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో 17 వార్డులలో ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వారికి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను తొలగిస్తుందని ప్రతి ఓటరు తమ ఓటును నిషితంగా పరిశీలించుకోవాలని మీకు ఏదైనా సందేహం ఉంటే వెంటనే ఎన్నికల సవరణ అధికారులకు తెలియజేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడటానికి కేంద్ర ప్రభుత్వ వైఫల్యం ఉందని ఎరువుల సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం తప్పులేదని అన్నారు. ముఖ్యంగా రైతులు ఎరువుల వాడకం తగ్గించాలనే ఉద్దేశంతో ఎరువుల సరఫరా సరిగా చేయడం లేదని అన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం తన 10 ఏళ్ల పాలనలో రూ.73వేల కోట్లు రైతులకు ఇస్తే మేము కేవలం 30 నెలల్లో రూ.27వేల కోట్లు రైతులకు ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించామని తెలిపారు. ఎరువుల కొరతపై బిజెపి ఎంపిలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్మన్ చిత్తారి పద్మరవిందర్, మాజీ చైర్మన్ రజితవెంకన్న, కమీషనర్ మల్లికార్జున్, తహశీల్దార్ లక్ష్మారెడ్డి, మాజీ గ్రంధాల చైర్మన్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు గాదెపాక రవిందర్, రజిత, పిల్లి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు వి.వి. రమణ మాజీ వైస్ చైర్మన్ అనితరెడ్డి, మాజీ ఎంపిపి ఆకుల వెంకన్నతో పాటు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# పుష్కరాలలో భక్తులకు సకల సౌకర్యాలు

### సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : 2027లో జరిగే గోదావరి నది పుష్కరాలకై తరలి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కొరకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ప్రైవేట్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలిసి మంత్రి అడ్లూరి గోదావరి నది తీరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2027 గోదావరి నది పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో వుందని పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు నదీ తీరంలోని పుణ్యక్షేత్రాలు, ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఇందులో ధర్మపురి నియోజకవర్గానికి రూ.117 కోట్లు కేటాయించినట్లు వివరించారు. పుష్కర స్నానాలు ఆచారించే భక్తులకు తాగునీటి సౌకర్యం, బట్టలు మార్చుకునే గదులు, మరుగుదొడ్ల సౌకర్యం, పారిశ్యుద్ధ్య పనుల నిర్వాహణ కొరకు గత పుష్కరాలు, కృష్ణ పుష్కరాలకు పనులు నిర్వహించిన ప్రతినిధులతో మంగళవారం ధర్మపురి గోదావరి నది తీరాన్ని పరిశీలించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు చేయాల్సిన ఏర్పాట్లపై కన్సల్టెన్సీ ప్రతినిధులు పూర్తిస్థాయి నివేదికను అందజేస్తారని చెప్పారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం నుండి అదనపు నిధులు తీసుకువచ్చి భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంత్రి వెంట జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, వేముల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఐ.రామయ్య, దేవస్థానం మాజీ చైర్మన్ జక్కు రవీందర్, కౌన్సిలర్లు చీపిరిశెట్టి రాజేష్, అయ్యోరి వేణుగోపాల్, వొజ్జల లక్ష్మణ్, పవన్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

## డాగ్‌స్క్వాడ్ బృందంతో విస్తృత తనిఖీలు



ప్రజాపక్షం/గంగాధర : గంగాధర, బూరుగుపల్లి గ్రామంలో మంగళవారం గంగాధర ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నుంచి వచ్చిన క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందం పాల్గొంది. గంగాధర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బూరుగుపల్లి గ్రామంలోని పాన్ షాపులు, వైన్స్ పర్మిట్ రూమ్‌లు, పాఠశాలల్లో ఇతర అనుమానస్పద ప్రాంతాల్లో అక్రమంగా మాదక ద్రవ్యాలు, గంజా వంటి నిషేదిత పదార్థాలు నిల్వ ఉంచుతున్నారా, విక్రయిస్తున్నారా అనే కోణంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి ప్రదేశాన్ని జాగ్రత్తగా పరిశీలించి అనుమానస్పద వస్తువుల కోసం తనిఖీలు నిర్వహించారు. ప్రజల్లో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కల్పించడంతోపాటు నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డాగ్‌స్క్వాడ్ బృందం, క్లూస్ టీం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాహార దీక్షకు ఎఐటియుసి మద్దతు



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి ఆర్జీ వన్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆర్జీ వన్ అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు పాల్గొని దీక్ష శిబిరంలో ఉన్న అధికారులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి లో అధికారుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని వారు ఆరోపించారు. అధికారులకు సంబంధించిన పి.ఆర్.పి, పే స్కేలు మూడు సంవత్సరాల నుండి పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని వెంటనే యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అధికారులకు చెందిన సమస్యల ను పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బిజెపి చీఫ్ నితిన్ నబిన్‌ను కలిసిన కరీంనగర్ మేయర్



ప్రజాపక్షం/కరీంనగర్ : హైదరాబాద్ వేదికగా మంగళవారం జరిగిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్న కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుని, మేయర్ పీఠాన్ని దక్కించుకున్నందుకు నితిన్ నబిన్ మేయర్ కొలగాని శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సన్మానించారు. కరీంనగర్ నగరపాలక సంస్థకు మంచి గుర్తింపు తీసుకువచ్చేలా, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పనిచేయాలని మేయర్‌కు నితిన్ నబిన్ సూచించారు. అలాగే బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, బిజెపి రాష్ట్ర పరిశీలకులు సునీల్ బన్సల్‌ను మేయర్ కొలగాని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. నగర కార్పొరేషన్ ను బిజెపి కైవసం చేసుకోవడం పట్ల సునీల్ బన్సల్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మేయర్‌ను సునీల్ బన్సల్ అభినందించారు. ఈ సందర్భంగామేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వయంగా అభినందించి సన్మానించడం తనకు మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని, వారి సూచనలను శిరసావహిస్తామన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థను రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం స్మార్ట్ సిటీ, అర్బన్ డెవలప్‌మెంట్ నిధులతో నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రతి డివిజన్ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని మేయర్ కోలగాని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాంట్రవర్సీలకు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు



'సర్' ప్రక్రియలో పాల్గొన్న 'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు

ప్రజాపక్షం/జమ్మికుంట : ప్రతి బూత్‌కి సంబంధించి ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనేలా చూడాలని, బూత్ లెవల్ ఆఫీసర్ వచ్చినప్పుడు ఓటర్లకు వారి అనుమానాలు నివృత్తి చేయడానికి బిఎల్‌ఏలు కృషి చేయాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని పలు వార్డులలో బుత్ కో ఆర్డినేటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లతో ఓటు సమగ్ర సవరణ (సర్) కార్యక్రమ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులలో తిరుగుతున్న సమయంలో ఓటర్లు పలు ప్రశ్నలు వేయగా వాటికి బూత్ లెవల్ ఆఫీసర్లతో మాట్లాడి అనుమానాలు నివృత్తి చేసేవిధంగా మాట్లాడారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి బూత్‌కు ఒక్కరితో జమ్మికుంట పట్టణానికి నలుగురు కోఆర్డినేటర్లను నియమించడం జరిగిందని వారు నిరంతరం ఏజెంట్లతో సమన్వయం చేస్తూ వేగవంతం చేయాలని సూచించారు. ఇక్కడున్న ఎమ్మెల్యే కాంట్రవర్సీలకు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను విమర్శించే ముందు 10 ఏళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు మేం చేసిన పనులు ఎందుకు చేయలేదో ఆత్మ విమర్శ చేసుకోవాలని మండిపడ్డారు. కాళేశ్వరం కట్టి లక్ష కోట్లు దోచుకొని కూళేశ్వరంగా మార్చి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా హామీలు నెరవేరుస్తూ పేదవాడి ప్రభుత్వంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో హుజురాబాద్ నియోజకవర్గ సర్ కోఆర్డినేటర్, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, యూత్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలి

### హౌసింగ్ కార్పొరేషన్ పిడి జె.రాజేశ్వర్

ప్రజాపక్షం/పెద్దపల్లి : 40 సంవత్సరాల పాటు వివిధ ప్రభుత్వ సంస్థల్లో వివాదరహితుడుగా పనిచేసి హౌసింగ్ కార్పొరేషన్‌లో పదవీ విరమణ పొందిన వడ్లూరి పరమాచారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని పెద్దపెల్లి జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ పిడి జె.రాజేశ్వర్ అన్నారు. మంగళవారం రోజున పదవి విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి పెద్దపల్లి డివిజన్లో డివిజన్ ఇంజనీర్‌గా విశిష్ట సేవలందించి, వివాదారహితుడిగా సేవలందించి, తన తోటి సిబ్బందితో కుటుంబ సభ్యునిగా ఉంటూ విశిష్ట సేవలు అందించారని వారి సేవలు మరువలేనివని వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం మంథని డివిజనల్ ఇంజనీర్ దస్తగిర్, అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్‌లు మాట్లాడుతూ పనే దైవంగా భావించి 40 సంవత్సరాల పాటు పలు ప్రభుత్వ సంస్థల్లో విశిష్ట సేవలు అందించారని, పనే దైవంగా భావించి పదవీ విరమణ పొందుతున్న డివిజనల్ ఇంజనీర్ వడ్లూరి పరమాచారికు శుభాకాంక్షలు తెలుపుతూ వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని అన్నారు. అనంతరం వడ్లూరి పరమాచారి దంపతులను తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఏఈలు సిబ్బందితోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## క్రిటికల్ కేర్ కేంద్రంలో సౌకర్యాల కల్పనకు నిరసన



ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్‌లోని క్రిటికల్ కేర్ ఆసుపత్రి పేరుకే క్రిటికల్ కేర్ అన్నట్లు ఉందని, ఆఘమేఘాల మీద నిర్మించిన క్రిటికల్ కేర్ భవనం రోగుల సౌకర్యాల కోసమా లేక కాంట్రాక్టర్ల ఉపాధి బిల్లుల కోసమో అర్థంకావడం లేదని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిటికల్ కేర్ ఆస్పత్రి ముందు మంగళవారం ఏఐవైఎఫ్ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం యుగంధర్ మాట్లాడుతూ క్రిటికల్ కేర్ అంటే అత్యవసర వైద్యం కోసం అన్ని రకాల పరికరాలు, వైద్య బృందం, సిబ్బంది ఏర్పాటు చేయాల్సి ఉండగా కనీస సౌకర్యాలు లేక రోగులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. క్రిటికల్ కేర్‌లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్యం కోసం పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం, తగిన సిబ్బందిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. రోగులకు అత్యవసరమైతే వరంగల్‌లోని ఎంజీఎమ్ లేదా హైదరాబాద్ ఎయిమ్స్, నిమ్స్ పంపిస్తున్నారన్నారు ఆసుపత్రిలో సరైన అర్హత గల సూపరింటెండెంట్ అనుభవం గల వ్యక్తిని ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డి.ఎం.ఇ పునరాలోచించి నియమించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో కాంట్రాక్టర్ అరాచకాలు శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలను కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారని సంబంధిత కాంట్రాక్టర్ సెక్యూరిటీలగాను ఇతరత్రా సిబ్బందులను కాంట్రాక్టర్ మానసికంగా దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.ఇలాంటి వారిని ప్రోత్సహిస్తున్న సదరు కాంట్రాక్టర్ అరాచకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో ఎం.ఆర్.ఐ స్కాన్ సెంటర్, ఆవరణలో ఆర్వో వాటర్ ప్లాంట్, ఏ.టి.ఎం సెంటర్ ఏర్పాటు చేయాలని, ఉచిత డెడ్ బాడీ వాహనాలు, నూతన ఫ్రీజర్లు ఏర్పాటు చేయాలన్నారు ప్రభుత్వ ఆసుపత్రిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని యుగంధర్ అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నగర కార్యదర్శి చెంచల మురళి, మాడిశెట్టి అరవింద్, ఆడెపు శ్రీనివాస్,రాజు, నరహరి ప్రేమలత, రాజేశ్వరి పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్


### మెనూ ప్రకారం భోజనం లేకపోవటంతో ప్రిన్సిపల్‌పై ఆగ్రహం

### చర్యలు తీసుకోవాలని ఆదేశం



ప్రజాపక్షం/సిద్దిపేట : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ హైమావతి సందర్శించి, మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం కామన్ డైట్ మెను తప్పనిసరిగా పాటించాలన్నారు. వండిన ప్రతివంటకం రుచికరంగా వడ్డించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం ప్రకారం కూరగాయాలు వండించాలన్నారు. ప్రతి వంటకం విద్యార్థులకు సరిపోయేంత వండి వడ్డించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆహారం పరబ్రహ్మ స్వరూపమని ఆహారాన్ని వృధా చేయవద్దన్నారు. మండల పరిషత్ పాఠశాలల్లో మెనుప్రకారం సాంబారు లేకపోవటం వల్ల ప్రిన్సిపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనును తప్పనిసరిగా పాటించాలని పదేపదే చెపుతున్న నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నందుకు పాఠశాలపై నిఘా పెట్టాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిఈఓను ఫోన్ ద్వారా ఆదేశించారు.

# విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించిన చొప్పదండి ఎమ్మెల్యే

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పాఠశాల పూర్వ విద్యార్థి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఎల్లారెడ్డిపేట రాచర్ల బొప్పాపూర్‌లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన తరగతి గదులను ప్రారంభించి, జాతీయ స్థాయి ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అందించి అభినందించారు. అలాగే ఉద్యోగ విరమణ పొందుతున్న డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుడిని సన్మానించి వారి సేవలను కొనియాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ విద్యాలయంలో అదనపు తరగతి గదులు పూర్తి చేయించామని, బోధన వసతులపై నమ్మకంతో తల్లిదండ్రులు పిల్లలను అడ్మిషన్ చేస్తూన్నారని అన్నారు. ప్రతి విద్యార్థి తమ నేపథ్యం ఏదైనా తాము ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు.

**పాఠశాల అభివృద్ధిపై సీఎం దృష్టికి తీసుకెళ్తా...**

పాఠశాల పూర్వ విద్యార్థి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పాఠశాల ఎంతో మందికి ధైర్యం ఇచ్చిందని, ఈ బడిలో సీటు రావడం చాలా కష్టంగా ఉండేదని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని అన్నారు. బొప్పాపూర్ స్కూల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. స్కూల్ అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. పాఠశాల అభివృద్ధిపై పూర్వ విద్యార్థిగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ గీతాంజలి పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియపై అవగాహన

### ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లి, రాజేశ్వరరావుపేట, చెర్లకొండాపూర్, జగ్గాసాగర్, ఆత్మనగర్, రామలచక్కపేట గ్రామాల్లో నిర్వహించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్) ప్రక్రియపై అవగాహన సదస్సుల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బూత్ స్థాయి నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. రైతుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత రాష్ట్ర సమితి నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్న ఆయన, త్వరలో ప్రారంభం కానున్న బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు, బూత్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



